సాక్షి
పల్నాడు
గురువారం । 13 । ఏప్రిల్ । 2023



పెదపలకలూరుకు కంచి పీఠాధిపతి

గుంటూరు రూరల్: కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి బుధవారం పెదపలకలూరులో పర్యటించారు. గతంలో దాతలు ఇచ్చిన భూమిని ఆయన పరిశీలించారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్టధర రూ.3,800 , గరిష్టధర రూ.6,500 , మోడల్ ధర రూ.5,000 వరకు పలికింది.

నాలుగు కరోనా కేసులు

గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా బుధవారం నాలుగు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. గుంటూరు నగరంలోని చుట్టుగుంటలో ఒకటి, మంగళగిరిలో ఒకటి, చినకాకానిలో రెండు కేసులు నమోదయ్యాయి. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.





గురువుకు గౌరవం

'ఆకలిగా ఉన్నప్పుడు దొరికిన అన్నం / అలసిపోయినప్పుడు దొరికిన నీడ / దుఃఖంలో ఉన్నప్పుడు ఓదార్చిన బంధాలు / కష్టంలో ఉన్నప్పుడు 'నేనున్నానని భరోసా ఇచ్చే పాలకుడు'.. ఈ నాలుగింటినీ ఎవరూ అంత తేలిగ్గా మరచిపోరు. వారి జీవిత కాలమంతా గుర్తుపెట్టుకుంటారు. గుండెల్లో గూడుకడతారు. తినే ప్రతి అన్నం మెతుకులోనూ తమ జీవితాలను సరిదిద్దిన వారిని మననం చేసుకుంటారు.. 1998 నాటి డీఎస్సీ ఉపాధ్యాయ అభ్యర్థుల మోముల్లో ఇదే గోచరమైంది. 25 ఏళ్ల తరువాత తమ 'ఉపాధ్యాయాన్ని' జగనన్న ప్రభుత్వం సాకారం చేయడంపై వారిలో ఆనందం వ్యక్తమవుతోంది.

- 1998 డీఎస్సీ క్వాలిఫైడ్స్‌కు కొలువులు
- క్వాలిఫై అయినా పోస్టింగ్స్ ఇవ్వని నాటి సీఎం చంద్రబాబు
- 25 ఏళ్లుగా న్యాయం కోసం నిరుద్యోగుల పోరాటం
- మానవతా దృక్పథంతో ఉద్యోగాలిచ్చిన సీఎం వైఎస్ జగన్
- గుంటూరు డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 226 మందికి పోస్టింగ్‌లు
- మినిమం టైం స్కేల్ పద్ధతిపై నియామకాలు
- అభ్యర్థుల మోముల్లో ఆనందోత్సాహాలు



గుంటూరు డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ కొలువు సాధించేందుకు 25 ఏళ్లుగా చేస్తున్న పోరాటం ఫలించింది. ఎప్పుడో 1998లో విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా ఉపాధ్యాయ అర్హత పరీక్షలు రాసి, క్వాలిఫై అయిన అభ్యర్థులు అప్పటి ప్రభుత్వం చూపిన మొండి చేయి కారణంగా ఉద్యోగాలను కోల్పోయారు. డీఎస్సీలో అర్హత సాధించినప్పటికీ 1999లో అప్పటి సీఎం చంద్రబాబు నిర్వాకంతో ఉద్యోగాలను పొందలేకపోయిన అభ్యర్థులు మంచి మనసున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దయతో ఉద్యోగాలను పొందగలిగారు. ఎప్పుడో 25 ఏళ్ల నాటి విషయం తనకెందులే అని అనుకోకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వేలాది మంది 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల కుటుంబాలు పడుతున్న ఇబ్బందులు, కష్టాలను తెలుసుకుని మానవత్వం కలిగిన నిండైన మనస్సుతో మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) పద్ధతిపై ఉద్యోగాలను ఇచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పాటు వెనువెంటనే నియామకాలు పూర్తి చేసేందుకు చేపట్టిన చర్యలు ఆచరణలోకి వచ్చాయి. నాడు క్వాలిఫై అయినా పోస్టింగ్స్ ఇవ్వకుండా నాటి సీఎం చంద్రబాబు మొండిచెయ్యి చూపగా, ప్రస్తుతం సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఉద్యోగాలను కల్పించారు.

226 మందికి....

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో 226 మంది క్వాలిఫైడ్ అభ్యర్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామకాలు చేపట్టేందుకు బుధవారం గుంటూరులోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈవో పి.శైలజ అధ్యక్షతన కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్స్ ఇచ్చారు. మొత్తం మీద కలగా మారి, ఇక ఉద్యోగాలు రావని నిరాశ, నిస్పృహలతో ఉన్న అభ్యర్థులు సీఎం వైఎస్ జగన్ పుణ్యమాని ఉద్యోగ నియామకాలు చేపట్టడంతో వారంతా ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. అపాయింట్ ఆర్డర్ చేతుల్లోకి వచ్చిన ఈ ఉపాధ్యాయులు ఏమన్నారంటే...



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈవో పి.శైలజ

అధ్యాపకం నుంచి ఉపాధ్యాయానికి



డీఎస్సీలో ఉద్యోగం రాకపోవడంతో వేర్వేరు డిగ్రీ కళాశాలల్లో అధ్యాపక వృత్తిలోకి వెళ్లా. ప్రస్తుతం ప్రభుత్వ మహిళా కళాశాలలో పీజీ కెమిస్ట్రీ గెస్ట్ అధ్యాపకురాలిగా పని చేస్తున్న సమయంలో ప్రభుత్వ పాఠశాలలో తిరిగి ఉపాధ్యాయురాలిగా ఉద్యోగాన్ని ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. కష్టానికి ప్రతిఫలంగా ప్రభుత్వం పోస్టింగ్ ఇవ్వడం మరువలేను.

–బి. సుచరిత, గుంటూరు

పిలిచి ఉద్యోగమిచ్చారు!



25 ఏళ్ల క్రితం భవిష్యత్‌పై ఎన్నో ఆశలతో డీఎస్సీ రాసి అర్హత సాధించా. అయితే పోస్టులను కుదించేసి, తక్కువ సంఖ్యలో భర్తీ చేయడంతో ఆవేదన చెందా. అప్పటి నుంచి ఎంతో ఆశగా ఎదురు చూశా. వై.ఎస్.జగన్ సీఎం అయితేనే మా కష్టాలు తీరుతాయని గాఢంగా నమ్మి, 2018లో మక్కా మదీనా వెళ్లి ప్రార్థన చేశా. 58 ఏళ్ల వయసులో ప్రభుత్వమే పిలిచి ఉద్యోగం ఇవ్వడం సామాన్యమైన విషయం కాదు.

–షేక్ సైసావలీ, మాచర్ల

పోరాటాలు చేశాం



డీఎస్సీలో క్వాలిఫై అయినా ఉద్యోగం రాకపోవడంతో గతంలో న్యాయ పోరాటం చేశాం. న్యాయం చేయాలని గత ప్రభుత్వాలకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. ప్రైవేటు పాఠశాలను ఏర్పాటు చేసి జీవనం సాగిస్తున్న తరుణంలో ప్రభుత్వం ఉద్యోగాలను కల్పించడం కలలో కూడా ఊహించ లేదు.

–బి. శ్రీనివాసరెడ్డి, ప్రత్తిపాడు

గౌరవం కల్పించారు



1998 డీఎస్సీ ద్వారా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సంపాదించాలని ఎంతో కష్టపడ్డా. అయినా అప్పటి పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఉద్యోగం చేజారింది. 18 ఏళ్లుగా పాఠశాలల్లో పనిచేశా. కోర్టులు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. ప్రభుత్వం పిలిచి, ఉద్యోగాన్ని ఇవ్వడంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా గౌరవం దక్కింది.

–బొప్పుడి శ్రీనివాసరావు, కుందురువారిపాలెం, ముప్పాళ్ల

'ఉక్కు' ప్రైవేటీకరణకు మేం వ్యతిరేకమే

రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి



పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): విశాఖ స్టీల్ ప్రైవేటీకరణకు తాము పూర్తి వ్యతిరేకమని రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి స్పష్టం చేశారు. పార్లమెంట్ వేదికగా తమ వాదనను నూరు శాతం వినిపించామని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు.

ప్రభుత్వ ఆస్తులు ప్రభుత్వం దగ్గరే ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం పలు గైడ్‌లైన్ పెట్టిందని, అయినప్పటికీ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు కాకుండా ఆపుతామని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు వారి బాధ్యత సక్రమంగా నిర్వర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానమంత్రిని కలిసి ఎన్నో అంశాలను ఆయన దృష్టికి తీసుకుని వెళ్లామని వివరించారు. ఉక్కు పరిశ్రమ నష్టాన్ని పూరించేందుకు క్యాపిటల్ మైన్స్ ఇవ్వాలని అడగటం జరిగిందన్నారు. అఖిలపక్షాన్ని తీసుకుని వెళ్లి ఈ అంశంపై మాట్లాడే అంశంలో పార్టీతో మాట్లాడి నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో జగనన్నే మా భవిష్యత్ ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లటం ద్వారా ఎంతో ఆదరణ లభిస్తోందని చెప్పారు.

ఎంపీ అయోధ్య రామిరెడ్డి వెంట తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు, షేక్ సజీల, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఆరోగ్యశ్రీ కార్యాలయంలో అగ్ని ప్రమాదం



మంగళగిరి: నగర పరిధిలోని చినకాకాని ఎన్నారై జంక్షన్‌లో గల వైఎస్సార్ ఆరోగ్య శ్రీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం చోటుచేసుకోగా ఉద్యోగులు, సిబ్బంది బయటకు పరుగులు పెట్టారు. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు.

యార్డుకు 1,15,410 బస్తాల మిర్చి రాక




కొరిటిపాడు (గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,15,410 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,14,880 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.25,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 90,186 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

కౌశల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కోసం నమోదు చేసుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: వివిధ దేశాల్లో ఉద్యోగాల భర్తీ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అంతర్జాతీయ కౌశల్ మహోత్సవంలో భాగంగా మొదటిసారిగా చేపడుతున్న అంతర్జాతీయ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కోసం ఈనెల 16లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని జిల్లాస్థాయి పారిశ్రామిక శిక్షణా సంస్థ సహాయ డైరెక్టర్ ఎస్. మధుసూదనరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కోసం ఒకటో తరగతి మొదలు ఉన్నత విద్యార్హతలు కలిగిన వారు, ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు https://kaushalmahotsav.nsdcdigital.org లింక్‌లో తమ పేరును రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 83339 73929 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

సాగర్‌లో 527 అడుగుల నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 527.10 అడుగుల వద్ద ఉంది. ఇది 162.5409 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి ఎడమ కాలువకు 4,034, ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 5,384 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 5,384 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 804.80 అడుగుల వద్ద ఉంది. ఇది 31.4403 టీఎంసీలకు సమానం.

పెరిగిన వేతనం..ఉపాధికి ఊతం

- వేసవి దృష్ట్యా ప్రభుత్వ నిర్ణయం
- అధికారులకు ఉత్తర్వులు.. ఏప్రిల్ 1 నుంచి అమలు
- ప్రస్తుత వేతనానికి అదనంగా రూ.15 పెంపు
- రూ.257 నుంచి రూ.272కు చేరిన వేతనం
- ఈ ఏడాది 87.35 లక్షల పనిదినాల కల్పనకు కేంద్ర ఆమోదం
- జిల్లాలో 3 లక్షల మంది కూలీలకు అదనంగా రూ.1.31 కోట్ల లబ్ధి



ఉపాధి పనుల పరిశీలన (ఫైల్)

యడ్లపాడు: పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన ప్రజలకు నిత్యం పని దొరికే ఉపాధి పథకం గొప్పవరమే. వేసవిలో ఉపాధి హామీ కింద పనిచేసే కూలీల వేతనం పెంపు నిర్ణయం తీసుకుంది. పెరుగుతున్న ధరల నేపథ్యంలో ప్రస్తుతం వారికి అందిస్తున్న రోజువారీ కనీస వేతనానికి అదనంగా మరో రూ.15 పెంచుతున్నట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ఇప్పటివరకు రోజుకు రూ.257గా ఉన్న వేతనం కాస్తా రూ.272కు చేరింది. దీనిని ఏప్రిల్ ఒకటో తేదీ నుంచే అమలు చేసేలా ఉత్తర్వులు చేసింది. ఉపాధి హామీ పథకం కింద 2023–24 ఆర్థిక సంవత్సరంలో పల్నాడు జిల్లాలో 87.35 లక్షల పనిదినాలకు లేబర్ బడ్జెట్ ఆమోదం జరిగింది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా సగటున 50 వేలమంది కూలీలు ఉపాధి పనులు నిర్వహిస్తుండగా, దీనిని రెట్టింపులో లక్షకు పెంచాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. దీంతో కూలీలకు ప్రస్తుతం ఉన్న వేతనానికి అదనంగా రూ.1.31 కోట్ల లబ్ధి చేకూరనుంది.

వాటికి చెక్ చెప్పేందుకే...

వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడం, ఫలితంగా పనుల కొరత ఏర్పడటంతో కూలీలు వలసలు పోవడం అనివార్యమైంది. యజమాని, లేదా ఆ కుటుంబమంతా తమ గ్రామాన్ని వీడి ఇతర ప్రాంతాలకు ఉపాధికై వెళ్లడం సర్వసాధారణమైంది. ఏటా వలసలు వెళ్తున్న కూలీల సంఖ్యను తగ్గించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతోంది. ఇందులో భాగమే మహాత్మగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధిహామీ పథకం అమలు. పని కావాలని అడిగిన ప్రతి ఒక్కరికీ ఎలాంటి సిఫార్సు లేకుండానే జాబ్ కార్డులు మంజూరు చేసి, కార్డులు కలిగిన వారందరికీ రోజూ పనులు కల్పిస్తున్నారు. వారికి నిర్ణయించిన కూలీ రేట్లను అందజేస్తున్నారు. దీంతో కూలీల కుటుంబ పోషణకు స్వగ్రామంలోనే ఉపాధి దొరికడంతో వలసలకు క్రమేణ తగ్గిపోతున్నాయి.

ఊరిలోనే ఉపాధి..ఆపై ఆదుకునే పథకాలు

ఒకప్పుడు ఇంటి పోషణ, పిల్లల చదువుల కోసం ఇంటి యజమానులు పొరుగు రాష్ట్రాలకు, దేశాలకు వలస వెళ్లేవారు. అయితే రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడంతో సంక్షేమ పథకాలు వెల్లువలా అమల్లోకి వచ్చాయి. దీంతో ఎక్కడికో వెళ్లి కూలీ చేసుకోవడం కంటే.. ఊరిలోనే ఉపాధి పని చేసుకుంటూ సంక్షేమ పథకాల లబ్ధి పొందొచ్చనే భావనకు వచ్చారు.

నిధుల భద్రత.. పనుల్లో నాణ్యత

నిధులు పక్కదోవ పట్టకుండా ఉండేందుకు వీలుగా ఉపాధి పనుల నిర్వహణకు మార్గదర్శకాలు చేశారు. గతంలో టీసీఎస్ సంస్థ సర్వర్‌ను నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్(ఎన్ఐసీ) సర్వర్‌కు మార్చారు. దీంతో గ్రామస్థాయిలో జరుగుతున్న పనుల్లో కూడా నాణ్యత ప్రమాణాలు పెరుగుతున్నాయి.

రోజు లక్ష మందికి ఉపాధి



వేతనదారులు సగటు వేతనం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. గరిష్టంగా రూ.272 వేతనం పొందవచ్చు. గ్రామాల్లో వ్యవసాయ పనులు లేనందున కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి. రోజుకు లక్ష మంది పనులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం. గ్రామ అభివృద్ధికి దోహదపడే పనులను గుర్తించి పథకం ద్వారా చేపడతాం. అలాగే ఉపాధిహామీ పథకం కింద ఉద్యానవన సాగు చేపట్టే రైతులు తమ భూముల మట్టినమూనాల పరీక్షలు చేయించుకోవాలి. పంట అనుకూలత ఎంపిక చేసుకుని పథకం కింద మంజూరు కోసం దరఖాస్తులు చేసుకోవాలి.

– జి.జోసఫ్‌కుమార్, డ్వామా పీడీ పల్నాడు జిల్లా

జిల్లాలో పథకం వివరాలు...

పల్నాడు జిల్లాలో 28 మండలాల పరిధిలో 534 గ్రామ పంచాయతీల్లో 3.07 లక్షల జాబ్‌కార్డులు గతేడాది అమల్లో ఉన్నాయి. వీటిలో 2.39 లక్షల జాబ్‌కార్డుల్లోని కూలీలు పనికి హాజరయ్యారు. 2022–23లో అధికారులు జిల్లా వ్యాప్తంగా 9,847 పనుల్ని చేపట్టగా, ఆయా పనుల్లో 78.23 లక్షల పని దినాల్ని కల్పించడం జరిగింది. మొత్తం జాబ్‌కార్డుల్లోని కుటుంబాలలో 3,371 కుటుంబాలకు 100 రోజులు పని కల్పించారు. గతేడాది జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద 186 మంది రైతులకు లబ్ధి చేకూరేలా 313.2 ఎకరాల్లో ఉద్యానవన పంటల సాగుని ప్రొత్సహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం రూ.87.35 లక్షల పనిదినాలకు లేబర్ బడ్జెట్‌ను ఆమోదించడం జరిగింది. వీటికి సంబంధించి ఇప్పటికే 3,923 పనుల్ని గుర్తించడం జరిగింది.

20 నుంచి ఎస్ఏ–2 పరీక్షలు

- షెడ్యూల్ విడుదల చేసిన ఎస్‌సీఈఆర్‌టీ
- సీబీఏ విధానంలో నిర్వహణ
- వచ్చే నెల ఒకటి నుంచి పాఠశాలలకు సెలవులు



సత్తెనపల్లి: ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు వార్షిక పరీక్షలు ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 1–5 తరగతులకు ఈనెల 20 నుంచి 27వ తేదీ వరకు వార్షిక పరీక్షలు నిర్వహించనున్నారు. 1–5 తరగతులకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించాలి. 6–9 తరగతులకు 20 నుంచి 29 వరకు ఉదయం పరీక్షలు నిర్వహిస్తారు. తొమ్మిదవ తరగతికి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు.

సీబీఏ విధానంలో....

క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్ (సీబీఏ) విధానంలో సమ్మేటివ్–2 పరీక్షలను నిర్వహించనున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎస్‌సీఈఆర్టీ సీబీఏ విధానాన్ని కొన్ని పరీక్షలకు అమలు చేస్తున్నారు. ఎఫ్–1, ఎఫ్–3 పరీక్షలను ఇప్పటికే సీబీఏ విధానంలో అమలు చేశారు. ఎఫ్ఏ–4, సమ్మేటివ్–1 పరీక్షలను పాత విధానంలోనే నిర్వహించారు. ప్రస్తుతం నిర్వహించనున్న సమ్మేటివ్–2 పరీక్షలను ఓఎంఆర్ విధానంలో విద్యార్థులు రాయాల్సి ఉంది.

టైం టేబుల్ విడుదల...

పరీక్షల నిర్వహణకు ఎస్‌సీఈఆర్‌టీ టైమ్ టేబుల్ విడుదల చేసింది. పరీక్షలు నిర్వహణ అనంతరం జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి ఫలితాలను ఆన్‌లైన్‌లో పొందు పరచాలని పాఠశాల విద్యాశాఖ అధికారులు సూచించారు. 1–2 తరగతులకు 20న తెలుగు, 24న ఇంగ్లిషు, 25న గణితం, 3–5 తరగతులకు 20న తెలుగు, 24న ఇంగ్లిషు, 25న గణితం, 26న పరిసరాల విజ్ఞానం, 6–9 తరగతులకు 20న తెలుగు, 24న హిందీ, 25న ఇంగ్లిష్, 26న గణితం, 27న జనరల్ సైన్స్, 28న సోషల్ స్టడీస్, 29న కాంపోజిట్ కోర్సులు పేపర్–1, మే 4న కాంపోజిట్ కోర్సులు పేపర్–2 నిర్వహిస్తారు.

ప్రశ్నపత్రాల పంపిణీకి చర్యలు

మండల విద్యాశాఖ కార్యాలయాలకు ప్రశ్నపత్రాలను చేర్చే పనిలో జిల్లా కామన్ ఎగ్జామ్ బోర్డ్ (డీసీఈబీ) నిమగ్నమైంది. ఈ నెల 18వ తేదీ నాటికి మండల కేంద్రాలకు ప్రశ్నపత్రాలను పంపించే అవకాశం ఉంది. ఆయా పాఠశాలల హెచ్ఎంలు ప్రశ్నాపత్రాలను సరి చూసుకుని ఎమ్మార్సీలో భద్రపరచుకోవాలి. పరీక్షల ప్రారంభం నుంచి సంబంధిత ప్రశ్నపత్రాల బండిళ్లను ఏరోజుకారోజు పరీక్షకు గంట ముందు ఎమార్సీల నుంచి ప్రధానోపాధ్యాయులు వచ్చి తీసుకెళ్లాల్సి ఉంటుంది.

ఈ నిబంధనలు తప్పనిసరి

- ప్రశ్నపత్రాల భద్రతకు ట్రంకు పెట్టెను ఏర్పాటు చేసుకోవాలి.
- ఎంఈఓలు ఏ రోజు ప్రశ్నపత్రాలను ఆరోజే ఇవ్వాలి.
- పరీక్ష మొదలయ్యే వరకు ప్రశ్నపత్రాల భద్రతా బాధ్యత ప్రధానోపాధ్యాయులదే.

పారదర్శకతతో పరీక్షల నిర్వహణ

పారదర్శకతతో పరీక్షలను నిర్వహించాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులపై ఉంది. ఎటువంటి అవకతవకలు, లోపాలకు ఆస్కారం లేకుండా నిర్వహించాలి. అపోహలకు తావు లేకుండా వార్షిక పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలి.

– ఏ శ్రీనివాసరావు, ఎంఈఓ, సత్తెనపల్లి

ఈబీసీతో ఆర్థికంగా ఎదగాలి

- జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్
- జిల్లాలోని 36,730 మంది లబ్ధిదార్లకు రూ.55 కోట్లు



ఈబీసీ నేస్తం మహిళలకు మెగాచెక్ అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఈబీసీ మహిళా లబ్ధిదార్లను కోరారు. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం రెండోసారి నగదు జమ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి ప్రారంభించే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరేట్ నుంచి లబ్ధిదార్లతో కలిసి వీక్షించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో దారిద్ర్యరేఖకు దిగువనున్న ఈబీసీ మహిళల్లో 45 నుంచి 60 ఏళ్ల వయసు కలిగి రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రీయ, వెలమలతో పాటు ఇతర ఓసీ సామాజిక వర్గాలకు రూ.55.095 కోట్లను 36,730 మంది లబ్ధిదారుల ఖాతాల్లో సీఎం జగన్ బటన్ నొక్కి నేరుగా జమ చేశారన్నారు. ఈబీసీ కార్పొరేషన్ ద్వారా ఏడాదికి రూ.15 వేలు చొప్పున మూడేళ్లకు రూ.45 వేలు ప్రభుత్వం అందిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. 2021–2022 ఏడాదిలో జిల్లాలో 32,393 మందికి రూ.48.50 కోట్లను తొలివిడతలో అందించిందన్నారు. రెండో విడతలో 2022–23 ఏడాదిలో రూ.55.095 కోట్లను 36,730 లబ్ధిదారులు జమచేశారని, మొత్తం రెండు విడతల్లో జిల్లా నుంచి 69,123 మంది మహిళల ఖాతాలకు రూ.103.685 కోట్లను జమచేశారన్నారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడారు. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాల వల్ల కలుగుతున్న మేలు ఏ విధంగా ఉపయోగపడుతుందో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటేశ్వర్లు, స్థానిక ఈబీసీ మహిళలు పాల్గొన్నారు.

రాజశేఖర్ అనే నేను..



శాసన మండలి సభ్యులుగా ఎన్నికైన మర్రి రాజశేఖర్ బుధవారం సెక్రటేరియేట్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో బాధ్యతలు స్వీకరించారు. అధికారులు ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించి నిబంధనావళి పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు పార్టీ నేతలు అభినందించి పుష్పగుచ్ఛాలు అందించారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నుంచి బుజ్జి బహిష్కరణ

సాక్షి, నరసరావుపేట: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న పెదకూరపాడుకు చెందిన ఎస్ఎస్‌వీఎస్ వరప్రసాద్(బుజ్జి)ని పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెలి రామకృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుజ్జి గత కొన్ని రోజులుగా తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలలో పాల్గొంటున్న నేపథ్యంలో క్రమశిక్షణ చర్యలలో భాగంగా ఈమేరకు చర్యలు తీసుకుంటున్న పేర్కొన్నారు.

కేఎల్‌యూలో ఆటిజమ్‌పై అంతర్జాతీయ సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ ప్రతిమా మూర్తి

మంగళగిరి: మానసిక దివ్యాంగులను ఆదరించాలని బెంగళూరు నిమ్ హాన్స్ వైద్యాధికారి, ప్రముఖ మానసిక శాస్త్రవేత్త డాక్టర్ ప్రతిమా మూర్తి పేర్కొన్నారు. నగర పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో బుధవారం జరిగిన ఆటిజమ్ అంతర్జాతీయ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ వసుధాదేవి అధ్యక్షతన జరిగిన సదస్సును డాక్టర్ ప్రతిమా మూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకే పలు దేశాల్లో మానసిక రోగులకు వైద్య సేవలను అందించడమే కాకుండా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ శాస్త్రవేత్త ఆల్‌బర్ట్ ఐన్‌స్టీన్ ఆటిజమ్ బాధితుడేనన్నారు. ఐన్‌స్టీన్‌కు బోధన చేయలేమని ఉపాధ్యాయులు చేతులెత్తేసినా గొప్ప శాస్త్రవేత్తగా గొప్ప విజయాలు సాధించి అందరినీ అబ్బురపరిచారని గుర్తు చేశారు. కేఎల్‌యూ వైస్ చైర్మన్ కోనేరు రాజా హరీన్ మాట్లాడుతూ ఆటిజమ్ ఉన్న వారిలో కూడా సాధారణ వ్యక్తుల్లో లేని నైపుణ్యాలు ఉంటాయన్నారు. ప్రో.వీసీ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు మాట్లాడుతూ ఆటిజమ్ చికిత్స, పిల్లల్లో అత్యుత్తమ ప్రతిభను వెలికి తీయడం గురించి వివరించారు. జపాన్‌కు చెందిన ప్రొఫెసర్ శ్యామ్యూల్ అబ్రహాం, డాక్టర్లు కె.నాగార్జున, వి.శ్రీదేవి, ఆటిజమ్ పిల్లలకు అమూల్యమైన సేవ చేస్తున్న ప్రముఖ సామాజిక కార్యకర్తలతో పాటు డాక్టర్ ప్రతిమా మూర్తి, డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ వై.అపర్ణలను ఘనంగా సత్కరించారు. వివిధ పాఠశాలలకు చెందిన ఆటిజమ్ పిల్లలు డ్యాన్స్, ఆటలు, క్విజ్ పోటీల్లో చురుగ్గా పాల్గొన్నారు.

బైపాస్ పూర్తి చేయకుంటే ఆమరణ దీక్ష

- రిలే దీక్షలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రకటన
- దిగొచ్చిన క్యూబిక్ హైవే లిమిటెడ్
- జూన్ 30 కల్లా పూర్తి చేస్తామని హామీ
- విరమించిన నిరవధిక రిలే దీక్ష



దీక్ష శిబిరంలో క్యూబ్‌లిమిటెడ్ సంస్థ ప్రతినిధులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల రూరల్: పిడుగురాళ్ల పట్టణ ప్రజలు ఎంతకాలంగా ఎదురుచూస్తున్న బైపాస్ నిర్మాణం గడువులోగా పూర్తి చేయకపోతే ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రకటించారు. మండలంలోని తుమ్మలచెరువు టోల్‌ప్లాజా వద్ద క్యూబిక్ హైవే ప్రైవేట్ లిమిటెడ్ బైపాస్ రోడ్డు నిర్మాణంపై నిర్లక్ష్యానికి నిరసనగా నిరవధిక రిలే నిరాహార దీక్ష బుధవారం చేపట్టారు. తొలుత పిడుగురాళ్ల పట్టణ నుంచి భారీగా వైఎస్సార్ సీపీ శ్రేణులతో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దీక్ష శిబిరం వద్దకు చేరుకున్నారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ అద్దంకి నార్కెట్‌పల్లి హైవే 212 కిలో మీటర్ల కాగా 206 కిలో మీటర్లు 2013లో పూర్తి చేసినట్లు వివరించారు. మిగిలిన భాగం పూర్తి చేయకపోవడంతో ఇప్పుడు పిడుగురాళ్ల పట్టణానికి శాపంగా మారిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడటంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో తాను స్వయంగా మాట్లాడటం, అసెంబ్లీల్లో మలుమార్లు బైపాస్ రోడ్డు గురించి వివరించినట్లు పేర్కొన్నారు. 2023 జనవరిలో క్యూబిక్ లిమిటెడ్ వారు అందుబాటులోకి తీసుకొని వస్తామన్నారు. కానీ సాధ్యం కాలేదన్నారు. ప్రతి రోజు బైపాస్ గురించి కంపెనీ ప్రతినిధులతో చర్చిస్తున్న ఫలితం లేకపోవడంతో దీక్షకు దిగినట్లు చెప్పారు.

దిగివచ్చిన క్యూబిక్ హైవే సంస్థ ప్రతినిధులు...

వెంటనే స్పందించిన క్యూబిక్ హైవే సంస్థ ప్రతినిధులు క్యూబ్ హైవేస్ చైర్మన్ హరికృష్ణరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ భగవన్‌రాజు, రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వైస్ ప్రెసిడెంట్ దివాకర్ రిలే నిరాహార దీక్షల వద్దకు వచ్చి ఎమ్మెల్యేతో చర్చించారు. బైపాస్ రోడ్డు పూర్తి చేయటానికి జూన్ 30వ తేదీ వరకు గడువు కావాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ అప్పటికి పూర్తి చేయకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, పట్టణ కన్వీనర్ చింతా రామారావు, రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి హాజరయ్యారు.

మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్

- ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- జేజేలు పలుకుతున్న మహిళలు



చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పీఆర్కే

వెల్దుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలను లక్షలాదికారులుగా చేయాలన్న ఉద్దేశంతో డ్వాక్రా గ్రూపు సభ్యులకు వైఎస్సార్ ఆసరా పథకాన్ని తీసుకొచ్చినట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) పేర్కొన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని కస్తూరిబా కళాశాలలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.24వేల కోట్ల డ్వాక్రా మహిళలు రుణపడి ఉన్నారని, మొత్తాన్ని నాలుగు విడతల్లో అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. ఇప్పటి వరకు మూడు విడతలలో మాఫీ చేశారన్నారు. మండలంలో 640 గ్రూపులకు గాను 6492 మంది సభ్యులకు రూ.3.76కోట్లు విడుదల చేశారని వివరించారు. మూడేళ్లలో రూ.11 కోట్లకు పైగా నిధులు విడుదల చేశారన్నారు. వెల్దుర్తి గ్రామంలో సంక్షేమ పథకాలకు మూడు సంవత్సరాలలో రూ.18కోట్లకు పైగా అందించారని చెప్పారు. సీఎం జగన్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తుంటే ఓర్చుకోలేని ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయని విమర్శించారు. మాజీ సీఎం చంద్రబాబు ఉన్నప్పుడు ఏ ఒక్కరికీ నేరుగా ఖాతాలలో ఒక్క రూపాయి కూడా జమ చేయలేదని ఎద్దేవా చేశారు. పిల్లనిచ్చిన మామనే వెన్నుపోటు పొడిచి మోసం చేసి పదవిని లాక్కున్నారని ఆరోపించారు. 2019 ఎన్నికలకు ముందు మహిళలను మోసం చేయటానికి పసుపు కుంకుమ కింద కొద్ది డబ్బులేసి మోసం చేశారన్నారు.

సీఎం జగన్ పదవిని చేపట్టినప్పటి నుంచి క్యాలెండర్ ప్రకారం అక్క చెల్లెమ్మల ఖాతాలో నేరుగా డబ్బులు అందించారని గుర్తు చేశారు. సాగర్ నుంచి దావుపల్లి వరకు జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పటి వరకు మండల అభివృద్ధి కోసం రూ.266కోట్లు మంజూరయ్యాయన్నారు. పల్నాటి ప్రజలు ఎదురుచూస్తున్న వరికపూడిశెల ఎత్తిపోతల పథకం నెల రోజుల్లో సాధించి సీఎం జగన్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయిస్తామన్నారు. తొలుత మహానేత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం, ఎంపీపీ చింతా శివరామయ్య, జెడ్పీటీసీ సభ్యులు రూప్లీబాలునాయక్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, రాయంకుల గోపాల్, మున్సిపల్ మాజీ చైర్మన్ బత్తుల ఏడుకొండలు, డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్, ఏపీఎం రవికుమార్ పాల్గొన్నారు.

అదనపు ఎస్పీ బిందుమాధవ్‌కు ఘనంగా వీడ్కోలు



కలెక్టరేట్‌లో బిందుమాధవ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: పల్నాడు జిల్లా అదనపు ఎస్పీగా విధులు నిర్వహించి పదోన్నతిపై ఎస్పీగా గ్రేహౌండ్స్‌కి వెళుతున్న గరికపాటి బిందుమాధవ్‌ను బుధవారం కలెక్టర్ కార్యాలయం, జిల్లా పోలీసు కార్యాలయాల్లో ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, డీఆర్వో కె.వినాయకం, ఏఆర్ అదనపు ఎస్పీ రామచంద్రరాజు, డీఎస్పీలు సి.విజయభాస్కరరావు, యు.రవిచంద్ర, బి.ఆదినారాయణరావు, సి.జయరామప్రసాద్ పాల్గొన్నారు. వినుకొండ రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో బదిలీ అయిన రమేష్ బాబును కూడా ఎస్పీ, ఇతర పోలీస్ అధికారులు ఘనంగా సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ మృతి

ఫిరంగిపురం: రోడ్డు ప్రమాదంలో హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మేరికపూడి గ్రామానికి చెందిన తాళ్లూరి సూర్యనారాయణ(51) నరసరావుపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా గుంటూరు నుంచి నరసరావుపేట వేరొకరి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. నుదురుపాడు సమీపంలోని కల్వర్టు వద్ద అతివేగంగా వచ్చిన టాటా ఏసీ వాహనం ఢీకొంది. ఈ ఘటనలో సూర్యనారాయణ ద్విచక్ర వాహనంపై నుంచి ఎగిరి పక్కనున్న ముళ్లపొదల్లోకి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మరోవ్యక్తి ఈపూరు మండలం గుండేపల్లికి చెందిన నాగరాజుకు తీవ్రగాయాలు కావడంతో ఇద్దరిని 108లో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స కోసం తరలించారు. వైద్యశాలలో సూర్యనారాయణ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీంతో అతడి మృతదేహానికి పంచనామ అనంతరం స్వగ్రామం మేరికపూడికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న పల్నాడు ఎస్పీ రవిశంకర్ రెడ్డి ఆదేశాల మేరకు రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి, ఎస్ఐ బాలనాగిరెడ్డి, పల్నాడు జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు టి.మాణిక్యాలరావు వచ్చి సూర్యనారాయణ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తక్షణ సాయంగా మృతుడి భార్యకు రూ.25 వేలు అందజేసినట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు.

బావిలో ఈతకు దిగి పాలిటెక్నిక్ విద్యార్థి గల్లంతు



గుంటూరు రూరల్: సరదాగా బావిలో ఈతకు దిగి పాలిటెక్నిక్ విద్యార్థి గల్లంతయిన ఘటన నల్లపాడులో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. నెల్లూరు నగరంలోని నాగేంద్రనగర్‌కు చెందిన మాదాల భరత్‌చంద్ర(18) నల్లపాడు గ్రామంలోని ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్నాడు. స్థానికంగా కాలేజ్ సెంటర్‌లోని ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్నాడు. పరీక్షలు ఉన్నా మరో 9 మంది స్నేహితులతో కలసి కళాశాల సమీపంలోని తురకపాలెం రోడ్డు రైల్వే క్వార్టర్స్ పరిధిలోని నీటి చెరువు వద్దకు వెళ్లారు. అక్కడే ఉన్న బావిలో తనకు ఈత వచ్చని ఈత వేస్తానని భరత్‌చంద్ర ఒక్కడే బావిలోకి దిగాడు. దిగిన అనంతరం మునిగి పోవటంతో పక్కనే ఉన్న స్నేహితులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ నరహరి పరిశీలించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. విద్యార్థిని వెలికి తీసే ప్రయత్నం రాత్రి వరకూ చేశారు. బావిలోతు ఎక్కువగా ఉండటంతో ఫలితం లేకుండా పోయింది. ఘటనపై రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పల్నాడులో వందేభారత్ రైలును ఆపండి

కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లిన ఎంపీ లావు

నరసరావుపేట: పల్నాడు ప్రాంతంలోని పలు రైల్వే సమస్యల పరిష్కారం కోరుతూ కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు బుధవారం ఢిల్లీలో కలిశారు. సికింద్రాబాద్ నుంచి తిరుపతి వరకు ఈ మధ్య ప్రారంభించిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను పల్నాడు జిల్లాలోని పిడుగురాళ్ల లేదా నడికుడి స్టేషన్లలో ఆపాలని విజ్ఞప్తి చేశారు. ఈ రెండు స్టేషన్ల నుంచి ప్రయాణికులు, వ్యాపారులు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో ప్రయాణం చేస్తుంటారని తెలిపారు. ఈ రైలు ఈ ప్రాంతంలో నిలపడం వల్ల జిల్లాలో పర్యాటక, వ్యాపార ప్రయాణాలను ఆకర్షించి, ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించవచ్చని మంత్రికి తెలిపారు. సికింద్రాబాద్ నుంచి తిరుపతి వరకు వందేభారత్ రైలును ప్రారంభించాలని చేసిన విన్నపం మేరకు రైలును ప్రారంభించినందుకు మంత్రికి ముందుగా ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పిడుగురాళ్ల, నడికుడి స్టేషన్లలో ఆగే కొన్ని రైళ్లు ప్రస్తుతం ఆగటం లేదని, కోవిడ్ సమయంలో కొన్ని రైళ్లు నిలుపుదల చేశారని, దీనివల్ల పెద్ద ఎత్తున ప్రజలు అసౌకర్యానికి గురవతున్నారని గుర్తుచేశారు. రైలు నెం. 12733-నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్, రైలు నెం.17255 - లింగంపల్లి ఎక్స్‌ప్రెస్, రైలు నెం.12603 -హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్, రైలు నెం.17626-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్, ట్రైన్ నెం.17015 విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్లను గతంలాగా పిడుగురాళ్ల, నడికుడి స్టేషన్లలో ఆగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రయాణికుల సౌలభ్యం కోసం సికింద్రాబాద్ - గుంటూరు మధ్య రెండో ట్రాక్‌ను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. తాను చేసిన ఈ అభ్యర్థనలపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు.

ఎరుకుల సమాజాభివృద్ధికి కృషి

నెహ్రూ నగర్: ఎరుకుల సమాజాభివృద్ధికి విద్యావంతులు కృషి చేయాలని ఏపీ ఎరుకల సంక్షేమ సంఘం చైర్మన్ పాలపర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా ఎరుకుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన మేడా గోపితో పాటు 40 మంది ఇతర కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార సభ నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 8 లక్షల మంది పైగా ఉన్న కుల దైవం ఏకలవ్యుని వారసులుగా ఎరుకల సమాజం విద్య ద్వారానే కుటుంబాల ఎదుగుదలతో పాటు సామాజిక రాజకీయ ఎదుగుదల సాధ్యమని గ్రహించాలన్నారు. మూడోసారి ఎంపికైన నూతన అధ్యక్షులు మేడా గోపి మాట్లాడుతూ గతంలోనే ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎరుకల సమాజం ఎదుర్కొంటున్న ఎదుర్కొన్న అనేక సమస్యలపై పోరాడి ప్రభుత్వం, రాజకీయ నాయకుల దృష్టికి తీసుకువచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేశామని అదే స్ఫూర్తితో పనిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసులు, రాష్ట్ర మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్ జయలక్ష్మి, కోశాధికారి లీలా శంకర్, జిల్లా గౌరవాధ్యక్షులు అమాసు శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి, ఎం వెంకటకృష్ణ, ఏడుకొండలు, టైగర్ శ్యాం ప్రసాద్ పాల్గొన్నారు.

జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌కు ఫుడ్ టెక్నాలజీ విద్యార్థిని

బాపట్ల: బాపట్ల ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాల విద్యార్థిని పి.హర్షిత వెంకట సాయి లక్ష్మి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌కు ఎంపికైనట్టు కళాశాల డీన్ డాక్టర్ వై.రాధా తెలిపారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఢిల్లీ) నిర్వహించిన పీజీ ప్రవేశ పరీక్షలో జాతీయస్థాయిలో మొదటి ర్యాంకు సాధించినట్టు వివరించారు. జయశ్రీ 12వ ర్యాంకు, వెంకట రుక్మిణి 13వ ర్యాంకు, సుగుణ్యారావు ఈడబ్ల్యూఎస్‌లో 5వ ర్యాంకు సాధించారని వివరించారు.

సుమనోహర తీరప్రాంతం బాపట్ల జిల్లా సొంతం. అటవీ లావణ్యానికీ ఇక్కడ కొదవేమీ లేదు. తీరం వెంబడి ఇసుక నెలల్లో విస్తరించిన మడ, జామాయిల్, జీడిమామిడి వనాలు సందర్శకులను కట్టిపడేస్తాయి. అరుదైన పక్షుల కిలకిలారావాలు పర్యాటకులను మైమరిపిస్తాయి. పచ్చని వనాల మధ్యలో నుంచి హొయలొలుకుతూ ప్రవహించే వంపుసొంపుల ఉప్పుటేరు భూతల స్వర్గాన్ని తలపిస్తుంది. అందులో బోటు షికారు మరుపురాని మధురానుభూతిని మిగులుస్తుంది. అందుకే ఈ ప్రాంతానికి పర్యాటక సొబగులు అద్దేందుకు అటవీశాఖ సమగ్ర ప్రణాళిక రూపొందించింది. మడ అడవుల విస్తరణకు చర్యలు చేపడుతోంది.



ప్రకృతి ఝురి పా'వనమయ్యే': అభివృద్ధి కానున్న ఉప్పుటేరు ప్రాంతం

తనివితీరని రూప లావణ్యం

- ఆకట్టుకునే తీరప్రాంత అటవీ అందాలు
- పర్యాటక అభివృద్ధికి అడుగులు
- ఉప్పుటేరు వాగు పొడవునా సుందరీకరణకు చర్యలు
- అటవీశాఖ సమగ్ర ప్రణాళిక

బాపట్ల జిల్లా తీర అటవీప్రాంతం ఇలా..	మడ అడవులు	జామాయిల్ తోటలు	జీడిమామిడి తోటలు
	1500 హెక్టార్లు	1297 హెక్టార్లు	225 హెక్టార్లు

బాపట్లటౌన్: జిల్లాలోని తీరప్రాంతం వెంబడి 9198.24 హెక్టార్లలో అటవీప్రాంతం ఉంది. ఇక్కడ మడ, జామాయిల్, సరుగుడు, జీడిమామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. అరుదైన వృక్షజాతులకు మడ అడవులు ఆలవాలంగా ఉన్నాయి. వనమూలికలూ లభ్యమవుతాయి. సుమారు 1500 హెక్టార్లలో మడ అడవులు విస్తరించి ఉన్నాయి. ఈ అడవుల అభివృద్ధికి ఇప్పటికే అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. రూ.30 లక్షలతో మరో 100 హెక్టార్లలో మడ చెట్లు పెంచుతున్నారు. ఈ అడవుల మధ్యలో సూర్యలంక సముద్రతీరంలోని పొగురు నుంచి నిజాంపట్నం వరకు ఉప్పుటేరు వాగు ప్రవహిస్తోంది. ఈ ప్రాంతం చూడముచ్చటగా ఉంటుంది.ఈ వాగులో బోటు షికారుకు పర్యాటకులు ఆసక్తి కనబరుస్తారు. అందుకే ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఆ శాఖ ఉన్నతాధికారులు ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపారు.

అరుదైన జంతుజాలం

ఇక్కడి మడ అడవుల్లో అరుదైన జంతుజాలం ఉంది. ఫిషింగ్ క్యాట్స్, బావురుపిల్లి, మరక పిల్లి, నీటి పిల్లి, నీటి కుక్కలు, డాల్ఫిన్స్ వంటివి ఇక్కడ జీవిస్తాయని అటవీ అధికారులు చెబుతున్నారు. వీటితోపాటు దేశ, విదేశాల నుంచి సీజనల్‌గా వచ్చే 120 రకాల పక్షులు పర్యాటకులకు కనువిందు చేస్తాయి.

జీడిమామిడి, జామాయిల్‌తో ఆదాయం

ఈ ప్రాంతంలో 1,297 హెక్టార్లలో జామాయిల్ తోటలు విస్తరించి ఉన్నాయి. వీటిద్వారా ఆదాయం వస్తుంది. ఈ తోటలు ప్రస్తుతం కోతకు సిద్ధంగా ఉన్నాయి. త్వరలో అటవీశాఖాధికారులు తోటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నారు. సుమారుగా రూ.80 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ ప్రాంతంలో ప్రత్యేకంగా మొక్కల పెంపకానికి అటవీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. పర్యావరణాన్ని పెంచే మొక్కలు పెంచాలని ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ ప్రాంతంలో 225 హెక్టార్లలో ఉన్న జీడిమామిడి తోటల ద్వారా ఏటా రూ.7లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది.

అడవుల సంరక్షణకు చర్యలు

తీర ప్రాంతానికి అడవులు అందంతోపాటు రక్షణనిస్తాయి. ఇక్కడ జామాయిల్, మడ, సరుగుడు, జీడిమామిడి తోటలు సుమనోహరంగా ఉంటాయి. వీటిని మరింత పెంచేందుకు చర్యలు చేపట్టాం. సంరక్షణకు నిరంతరం నిఘా ఏర్పాటు చేశాం. అడవుల్లో వృక్షాలను నరకడం నేరం. అందరూ అటవీ పరిరక్షణకు చర్యలు చేపట్టాలి. లేకుంటే మానవ మనుగడకే ముప్పు వాటిల్లుతుంది.
– ఎల్.భీమయ్య, జిల్లా అటవీశాఖాధికారి



జనజీవనానికి' రక్ష : ఉప్పుటేరు ఇరువైపులా విస్తరించిన అడవులు



కనులు సంబర 'పడవ' : ఉప్పుటేరు వాగులో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు, అటవీశాఖ అధికారులు (ఫైల్)



లక్ష్య'మొక్క'టే: అడవులదీవిలో మడ మొక్కలకు నీరు పెట్టేందుకు కాలువలు తవ్వుతున్న దృశ్యం